
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



రూ.68 వేల విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మ వారికి సిక్కిరెడ్డి సీతారామాంజనేయ ప్రసాద్, మురళీధరరావు (హైదరాబాద్) శనివారం రూ.68 వేల విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం గోదావరి తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సెహరీ సోమ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.30
కాకినాడ	6.25	4.30
అమలాపురం	6.25	4.30

న్యూస్‌రీల్

మర్యాదపూర్వకంగా..



శాంతికుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఆర్డీఓ చైత్రవర్షిణి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారిని కలెక్టర్ కె.మాధవీలత శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శాంతికుమారికి కలెక్టర్‌తో పాటు, ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు స్వాగతం పలికారు.

12 నుంచి మొదటి విడత ర్యాండమైజేషన్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 12 ,13 తేదీల్లో బ్యాలెట్ యూనిట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, ఇతర అనుబంధ సిబ్బందికి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఉపయోగించే బ్యాలెట్ యూనిట్లను ర్యాండమైజేషన్ విధానంలో ఆయా నియోజకవర్గాలకు కేటాయిస్తామని తెలిపారు. దీనికోసం ప్రతి నియోజకవర్గం నుంచి 11 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆ రోజుల్లో ఉదయం 7 గంటలకు ఈవీఎంలు భద్రపరచిన ఎఫ్‌సీఐ గోడౌన్‌కు చేరుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ, సీటింగ్ ఏర్పాటు, సిబ్బంది విధులు, బాధ్యతలు, డేటా నమోదు, ఈఎంఎస్ యాప్‌లో వివరాల అప్‌లోడ్‌పై ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారని వివరించారు. మొదటి విడత ర్యాండమైజేషన్ అనంతరం ఆయా నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు కేటాయిస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

'నన్నయ'లో టీసీఎస్ పరీక్ష

రాజానగరం: వివిధ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయడంలో భాగంగా టీసీఎస్ సంస్థ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం రాత పరీక్ష నిర్వహించింది. యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్, వికాస సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ పరీక్షకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి, మెట్రో నగరాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

లెక్క లేకుంటే చిక్కులే..

- ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిందే
- లెక్కా పత్రం లేకుండా చిక్కితే నగదు, సామగ్రి జప్తు తప్పదు
- విడుదలపై జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షణ
- జప్తుపై ప్రామాణిక కార్యాచరణ



తుని-నర్సీపట్నం రోడ్డులో పోలీసుల వాహనాల తనిఖీ



కాకినాడ ఇంద్రపాలెం వంతెన వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలు ప్రారంభమైంది మొదలు.. జిల్లా వ్యాప్తంగా తనిఖీ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. ఈ సందర్భంగా భారీగానే నగదు, మద్యం వంటివి స్వాధీనం చేసుకుంటున్నారు. కేవలం చెక్‌పోస్టుల వద్ద వాహనాలే కాదు.. అవసరమైతే ఇళ్లు, హోటళ్ల వంటి వాటిల్లో సైతం తనిఖీలు చేసే అధికారం ఈ బృందాలకు ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ అవసరాలకు భారీగా నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ఇతర సామగ్రి తీసుకుని వెళ్లాలనుకుంటే తగిన ఆధారాలు వెంట ఉంచుకోవాల్సి ఉంటుంది. అధికారులు అడిగినప్పుడు వాటిని చూపించాల్సి ఉంటుంది. ఎటువంటి లెక్కా పత్రం లేకుండా పట్టుబడితే మాత్రం.. ఆ నగదు, సామగ్రిని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుంటారు. తర్వాత దాని విడుదల కోసం నానా తంటాలూ పడాల్సి వస్తుంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదేపదే సూచిస్తున్నారు.

పట్టుబడితే ఇబ్బందే..

ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పోలీసులు, రెవెన్యూ బృందాలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. నగదు, ఇతర సామగ్రికి సంబంధించి తమకు వచ్చిన సమాచారం మేరకు నిఘా బృందాల అధికారులు రోడ్లపై వాహనాలతో పాటు అవసరమైతే లాడ్జిలు, ఇళ్లల్లో సైతం తనిఖీలు చేస్తారు. ఈ బృందాలతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైతం నిఘా తీవ్రతరం చేశారు. వీరి తనిఖీల్లో ప్రతి రోజూ దాదాపు రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. వీటిల్లో సామాన్యులకు సంబంధించినదే అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. పెద్ద ఎత్తున డబ్బు, సామగ్రి పట్టుబడితే దానిని ఎక్కడి నుంచి ఎక్కడకు తరలిస్తున్నారు, ఎందుకు తరలిస్తున్నారనే విషయాలపై నిఘా అధికారులు ఆరా తీస్తారు. సరైనా ఆధారాలు లేకపోతే ఆ నగదు, సామగ్రిని జప్తు చేస్తారు. నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తారు.

లెక్కలు సరిగ్గానే ఉన్నా..

అయితే, ఆధారాలు సరిగ్గానే ఉన్నాయని భావించినప్పటికీ పట్టుబడిన నగదు, సామగ్రిని వదిలేయడంపై క్షేత స్థాయి అధికారులే నిర్ణయం తీసుకోవడం కుదరదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే, నగదు, సామగ్రిని స్వాధీనం చేసుకునే క్రమంలో కొన్ని సందర్భాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది దారి తప్పే అవకాశముంటుంది. ఈ ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా జిల్లా స్థాయి కమిటీని నియమించింది. క్షేత్ర స్థాయి తనిఖీ బృందాలు పెద్ద ఎత్తున డబ్బు పట్టుకున్నా.. ఆధారాలు సరిగానే ఉన్నప్పటికీ దానిని వదిలేయకుండా విషయాన్ని తప్పనిసరిగా జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లాలి. దీనికోసం ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) అమలు చేస్తున్నారు. పట్టుబడిన నగదు, సామగ్రి విడుదల, జప్తు వంటి అంశాలపై అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ ఎన్నికల నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటుంది.



సుమోటోగా విచారణ

ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు తరలిస్తూ తనిఖీ బృందాలకు చిక్కితే దానిపై వెంటనే రిటర్నింగ్ అధికారితో పాటు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్నికల విభాగం ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళుతోంది. ఒకవేళ పత్రాలు సరిగ్గా ఉండి, ఆ డబ్బు ఎన్నికల వ్యవహారంతో సంబంధం లేనిదేనని కచ్చితంగా నిర్ధారించుకుంటే మాత్రం స్థానిక రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా దీనిపై జిల్లా స్థాయి కమిటీ సుమోటోగా విచారణ జరుపుతుంది. ఈ తరహా ఘటనలపై రోజువారీ నివేదికలు రూపొందిస్తోంది. ఒకవేళ సొమ్మును జప్తు చేస్తే మాత్రం అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం ఇస్తోంది. ఎవరికి అప్పీలు చేసుకోవాలనే విషయాన్ని డబ్బు తరలిస్తున్న వ్యక్తులకు తెలియజేస్తోంది.

రూ.10 లక్షలు దాటితే..

లెక్కా పత్రం సరిగ్గానే ఉన్నప్పటికీ రూ.10 లక్షల కంటే ఎక్కువ సొమ్ము తరలిస్తూంటే మాత్రం జిల్లా స్థాయి కమిటీ తప్పనిసరిగా ఆదాయ పన్ను శాఖ నోడల్ అధికారికి సమాచారం అందిస్తున్నారు. ఆ శాఖ సంబంధిత వ్యక్తులకు తాఖీదులు జారీ చేస్తోంది. వివరణ సంతృప్తికరంగా ఉంటే ఫర్వాలేదు. లేకుంటే లెక్క ప్రకారం పన్ను మినహాయించుకుని తిరిగి ఇవ్వనున్నారు.

కొత్తకొత్తగా...

- హాలోగ్రామ్‌తో కూడిన ఓటరు గుర్తింపు కార్డులు
- స్పీడ్ పోస్టు ద్వారా ఇంటికే పంపిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం
- కొత్తగా ఓటు హక్కు పొందిన వారందరికీ పంపిణీ



హోలోగ్రామ్‌తో కూడిన ఓటరు గుర్తింపు కార్డు

రాజమహేంద్రవరం రూరల్: కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి కేంద్ర ఎన్నికల సంఘం సరికొత్త ఓటరు గుర్తింపు కార్డులు (ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు – ఎపిక్) మంజూరు చేస్తోంది. వీటిని స్పీడ్ పోస్టులో నేరుగా వారి ఇళ్లకే పంపిస్తోంది. దీంతో పాటు వారికి అభినందనలు తెలియజేస్తూ, ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా కోరుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందేశంతో కూడిన పత్రాలు అందజేస్తోంది.

భద్రతా ప్రమాణాలతో..

నూతన ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాయి. నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను నివారించేందుకు, ట్యాంపరింగ్ చేసేందుకు వీలు లేని విధంగా దీనిపై మన దేశ చిత్రపటంతో కూడిన హాలోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ పీవీసీ కార్డులపై ఓటర్ల ఫొటోలు గతంలో కంటే మరింత స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. దీంతో పాటు, ఓటరు పూర్తి పేరు, చిరునామా తదితర వివరాలను ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ముద్రించారు. అధికారుల తాజా లెక్కల ప్రకారం జిల్లాలో 16,14,140 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో కొత్తగా ఓటు హక్కు పొందిన 93,444 మందితో పాటు నియోజకవర్గ మార్పు, ఓటరు వివరాల్లో సవరణలు, చిరునామాల్లో మార్పులు చేసుకున్న వారు కూడా ఉన్నారు. వీరందరూ తమ గుర్తింపు కార్డును ఎన్నికల సంఘం సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారిని ప్రోత్సహించేందుకు ఎన్నికల సంఘం వారికి పీవీసీ కార్డులను స్పీడ్ పోస్టులో పంపిస్తోంది.

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల సందడి



పెద్దాపురం: తిరుపతి గ్రామంలోని స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు ఎండ తీవ్రత నేపథ్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలో వివిధ టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,82,610 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

- 98.84 శాతం మందికి అందజేత
- సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ అభినందన

రాజమహేంద్రవరం రూరల్ : జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు ఈ పనిని సమర్థవంతంగా పూర్తి చేశారు. చంద్రబాబు అండ్ కో కుట్ర ఫలితంగా ఈ నెల నుంచి వలంటీర్ల ద్వారా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి, సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించింది. పింఛన్ల కోసం ఎక్కడెక్కడి నుంచో ఆపసోపాలు పడుతూ వచ్చిన లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు టెంట్లు వేసి, నీడ, తాగునీరు ఇచ్చి మరీ పింఛన్ల నగదు చేతిలో పెట్టి పంపించారు. చంద్రబాబును తిట్టుకుంటూ సచివాలయం వరకూ వచ్చిన లబ్ధిదారులు ప్రభుత్వాన్ని, సచివాలయ ఉద్యోగులను మెచ్చుకుంటూ తిరిగి వెళ్లడం కనిపించింది. గత బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా, చివరి రోజయిన శనివారం రాత్రి 9 గంటల సమయానికి జిల్లావ్యాప్తంగా 98.84 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో మొత్తం 2,43,831 మంది లబ్ధిదారులకు రూ.72.39 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 2,40,851 మందికి రూ.71.55 కోట్లు అందజేశారు. మంచం పట్టిన రోగులు, 40 శాతం పైబడిన దివ్యాంగ పెన్షన్‌దారులకు ఇంటివద్దనే సచివాలయ ఉద్యోగులు పింఛన్లు అందజేశారు. నల్లజర్ల 99.16 శాతం, గోకవరం 99.07 శాతం, కోరుకొండ 99.01 శాతం పంపిణీతో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. నిడదవోలు అర్బన్ 98.41 శాతం, రాజమహేంద్రవరం అర్బన్ 98.56 శాతం, ఉండ్రాజవరం 98.62 శాతం మందికి పంపిణీ చేయడం ద్వారా చివరి స్థానాలు దక్కించుకున్నాయి. ప్రతి నెలా సామాజిక భద్రత పింఛన్లు సగటున 99.10 శాతం నుంచి 99.07 శాతం వరకూ పంపిణీ అవుతున్నాయి. లక్ష్యాలను సాధించడంలో క్షేత్ర స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది చేసిన కృషిని కలెక్టర్ మాధవీలత అభినందించారు.



కడియం గ్రామానికి చెందిన వృద్ధురాలికి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పింఛను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఫేక్ న్యూస్‌పై ఫోకస్

- ఎన్నికల వేళ సోషల్ మీడియాపై నిఘా
- ఫిర్యాదులకు ప్రత్యేక సెల్
- రెచ్చగొట్టే, విభేదాలు రేకెత్తించే వారిపై చర్యలు
- గ్రూపు అడ్మిన్లే తొలి బాధ్యులు



అమలాపురం టౌన్: సోషల్ మీడియ వేదికగా ఎవరెవరిపైనే ఏవేవో తప్పుడు పోస్టింగులు రావడం సహజమే. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అలాంటి ఫేక్ న్యూస్‌పై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. ఇందు కోసం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసింది. ఎన్నికల వేళ ముఖ్యంగా రాజకీయ పార్టీల వారు ప్రత్యర్థులపై తప్పుడు ప్రచారాలను పదే పదే ట్రోల్ చేసి ఆయా పార్టీల్లో వర్గ విభేదాలు, తద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తదనుగుణంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఇలాంటి ఫేక్ న్యూస్‌పై జల్లెడ పడుతోంది. ఈ విషయంలో జిల్లా ప్రజలను, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులకు చైతన్యం, అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు ఓ వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి ఓ ప్రత్యేక నంబరు కేటాయించింది. సైబర్ క్రైమ్ విభాగంతో కలిసి పనిచేసే ఆ వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు రంగంలోకి దిగి బాధ్యులను గుర్తించి చర్యలు చేపడతారు.

తప్పుడు ట్రోల్‌పై వాట్సాప్ చేయండి

సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని ట్రోల్ చేస్తున్నప్పుడు సామాజిక స్పృహ కలిగిన ప్రజలు ఈ విషయాన్ని తక్షణమే జిల్లా పోలీసు శాఖ నిర్దేశించిన '8143579125' అనే ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయాలి. దీని కోసం జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటుచేసి వాట్సప్ నంబరును అమలులోకి తీసుకువచ్చారు. ఎన్నికల వేళ సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల్లోని కొన్ని సామాజిక వర్గాల నడుమ, లేదా వ్యక్తుల మధ్య ఘర్షణ పూరిత వాతావరణాన్ని రెచ్చగొట్టేలా ఈ తప్పుడు సమాచారం ట్రోల్ అవుతున్నా, వైరల్ అవుతున్నా ప్రజల్లో ఎవరైనా పోలీసు వాట్సప్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇలా ఫిర్యాదు చేసిన వారి పేర్లు, చిరునామాను పోలీసులు అత్యంత రహస్యంగా ఉంచుతారు.

తొలి చర్యలు అడ్మిన్లపైనే

ఏవైనా సోషల్ మీడియా గ్రూపులో ఈ తరహా తప్పుడు సమాచారం ట్రోల్ అవుతూ విస్తృత ప్రచారం చేస్తుంటే పోలీసులు తొలుత ఆ గ్రూపు అడ్మిన్‌నే బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటారు. తర్వాత లోతైన దర్యాప్తుతో ఈ తప్పుడు పోస్ట్ ఎవరు చేశారని సాంకేతికంగా ఆరా తీసి గుర్తిస్తారు. అప్పుడు వారిపై చర్యలకు ఉపక్రమిస్తారు. వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో తప్పుడు వార్తలు, అవాస్తవాల ప్రచారం, బెదిరింపులకు పాల్పడితే అడ్మిన్లు బాధ్యులు అవుతారు. ఈ మేరకు జిల్లా పోలీసు శాఖ దీనిపై వాట్సప్‌ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది.



సోషల్ మీడియా ఫిర్యాదుల కోసం జిల్లా పోలీసు శాఖ ముద్రించి ప్రచారం చేస్తున్న వాట్సాప్ ఫోన్ నెంబరు

ఇవీ అడ్మిన్ల బాధ్యతలు

- గ్రూపులో ప్రతి పోస్టుకు అడ్మిన్‌దే బాధ్యత
- గ్రూపులో ప్రతీ పోస్టును అడ్మిన్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి
- వివాదాస్పద పోస్టులను గుర్తించి ఆ సమాచారం తక్షణమే పోలీసులకు ఇవ్వాలి
- అటువంటి వాటిని తక్షణమే డిలీట్ చేయాలి
- తరచూ తప్పుడు సమాచారం ట్రోల్ చేసే గ్రూపు సభ్యులను గుర్తించి వారిని తక్షణమే గ్రూపు నుంచి తొలగించాలి
- గ్రూపులోని ప్రతి సభ్యుడు తప్పకుండా అడ్మిన్‌కు తెలిసి ఉండాలి
- అడ్మిన్ తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకోకుంటే గ్రూపు అడ్మిన్ కూడా నేరస్తుడే
- వివాదాస్పద పోస్టుల పెడితే చట్టరీత్యా శిక్షార్హులన్న విషయాన్ని గ్రూపులో అడ్మిన్లు గ్రూపులో సందేశాలివ్వాలి.
- ఐపీఎస్ సెక్షన్ 153ఎ ప్రకారం కేసు నమోదు అవుతుంది. బాధ్యులకు ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడుతుంది.

షేర్ చేయకూడని అంశాలు

- విద్వేషాలు రెచ్చగొట్టేవి
- వర్గ పోరుకు దారి తీసేవి
- దేశ, శాంతి భద్రతకు ముప్పు కలిగించేవి
- మార్ఫింగ్ చేసిన ఫొటోలు
- ఫేక్ న్యూస్ అని తెలిస్తే దాని జోలికి వెళ్లకూడదు
- వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు
- పోర్న్ క్లిప్స్, వీడియోలు
- తప్పుదారి పట్టించే సమాచారం

అమలాపురంలో జనసేనకు షాక్

- వైఎస్సార్ సీపీలో శెట్టిబత్తుల రాజబాబు
- సీఎం జగన్ సమక్షంలో చేరిక

సాక్షి, అమలాపురం: జనసేనకు ఎంతో కొంత పట్టు ఉందని చెప్పుకొంటున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. మొన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన పితాని బాలకృష్ణ ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరగా.. తాజాగా దళిత వర్గానికి చెందిన శెట్టిబత్తుల రాజబాబు సైతం జనసేనకు గుడ్‌బై చెప్పి, వైఎస్సార్ సీపీలో చేరారు. నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో అమలాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు భారీ సంఖ్యలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. నెల్లూరు జిల్లా ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీఎం జగన్.. జనసేన నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. రాజబాబుతో పాటు జనసేన తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనుబాబు, ఎస్సీ డివిజన్ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆ పార్టీ వీరమహిళా నాయకురాలు చెట్టి సుభాషిణి, జనసేన అమలాపురం మండల ప్రధాన కార్యదర్శి కె.చినబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న రాజబాబు ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలందించారు. ఒకానొక సమయంలో రానున్న ఎన్నికల్లో అమలాపురం నుంచి రాజబాబుకు జనసేన టికెట్ ఖరారైనట్టు ప్రచారం జరిగింది. అయితే పార్టీ అధినేత పవన్ కల్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఒత్తిడికి లొంగి, అమలాపురం అసెంబ్లీ స్థానాన్ని టీడీపీకి వదిలేశారు. పార్టీకి ఇన్నేళ్లుగా సేవలందిస్తున్న రాజబాబును పక్కన పెట్టారు. ఈ నిర్ణయం జనసేనలో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. జనసేనలోని వివిధ విభాగాలకు చెందిన కొంతమంది నాయకులు ఇప్పటికే వైఎస్సార్ సీపీలో చేరారు.

ఘనంగా ప్రాకార సేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం ముందున్న ఆలయ ప్రాంగణంలోకి తీసుకుని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు.

క్లుప్తంగా

బోటు ప్రమాద ఘటనలో యానాం వాసులు

బాధితులను పరామర్శించిన మల్లాడి




తీవ్రంగా గాయపడ్డ సంగాని పెదసత్తిబాబు, దండుప్రోలు శ్రీను

యానాం: విశాఖపట్నం సముద్రతీరానికి 65 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం బోటులో సిలిండర్ పేలిన ఘటనకు సంబంధించి గాయపడిన తొమ్మిది మందిలో స్థానిక మత్స్యకారులు ఇద్దరు ఉన్నారు. బాధిత కుటుంబాలు విశాఖకు బయలుదేరి వెళ్లాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లేటపుడు వంట చేసుకునేందుకు తీసుకువెళ్లిన సిలిండర్ పేలడంతో వారు గాయపడ్డారు. గత నెల 26న కాకినాడకు చెందిన దుర్గాభవానికి చెందిన ఐఎన్‌డీ ఏపీ 47 నంబరుగల బోటులో వారు చేపల వేటకు వెళ్లి తిరిగి ఈ నెల 14న రావాల్సి ఉంది. యానాం పరిధిలోని ఓల్డ్ రాజీవ్‌నగర్‌కు చెందిన 50 ఏళ్ల సంగాని పెదసత్తిబాబు, 38 ఏళ్ల దండుప్రోలు శ్రీనులకు ముఖంతో పాటు శరీరం, ఇతర భాగాలు కాలిపోయి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బాధితులను ఆదుకోవాలని రంగసామిని కోరారు. అలాగే ఆయన విశాఖ వెళ్లి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ఒకరి పరిస్థితి విషమం



విశాఖ కేజీహెచ్‌లో క్షతగాత్రుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కాకినాడ రూరల్: ఈ ప్రమాదంలో గాయపడిన 9 మందిలో నలుగురు తీవ్రంగాను, ఐదుగురు స్వల్పంగా గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో బలుసుతిప్పకు చెందిన ఆర్.సత్తిబాబు 80 శాతం, యానాంకు చెందిన కె.ధర్మారావు 68 శాతం కాలిన గాయలతో చికిత్స పొందుతుండగా సత్తిబాబు పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు తెసింది. కాకినాడకు చెందిన దండు వీరబాబు, వై.వీరబాబు, బలుసుతిప్పకు చెందిన భైరవస్వామి, గంగాద్రి, నాయేటి వజ్రం క్షేమంగా ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

అంబాజీపేట: ఒంటరి జీవితాన్ని గడుపుతున్న ఓ వ్యక్తి శనివారం ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటకు చెందిన కడలి వెంకటరమణ (50) గత కొన్నేళ్లుగా కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే 15 ఏళ్ల క్రితం భార్య, పిల్లలు వదిలి వెళ్లిపోవడంతో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడన్నారు. శనివారం తెల్లవారు జామున అతని ఇంటిలో ఉరివేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించారన్నారు. అతని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాహితీ వసంతానికి కవికుల స్వాగతం

- ఉగాది కోయిలల కవనవేదిక కొత్తపేట
- 36 ఏళ్లుగా సాగుతున్న కళాసాహితి సేవలు
- నేడు 36వ సాహితీ సభ-కవి సమ్మేళనం

కొత్తపేట కళా సాహితి లోగో



కొత్తపేట ఉగాది కవి సమ్మేళనం, సాహితీ సభలో మాట్లాడుతున్న అద్దేపల్లి (ఫైల్)

కొత్తపేట: మావి చివుర్లు తిని వచ్చే మత్త కోయిలలు.. వేదికలపై కళాత్మక వీరవిహారం చేసే కవి మత్తేభాలు.. నేనూ ఓ కవిత విసురుతానని సరదా తీర్చుకనే తూనీగలు.. ఆసువుగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయే సీతాకోక చిలుకలు.. ఒకటేమిటి.. షడ్రుచి భరితమైన కవి సమ్మేళనాల మేళవింపుల వేదిక స్థానిక కళాసాహితి. మరో యుగాదికి ఆహ్వానం పలుకుతూ 36 ఏళ్ల పూర్తి చేసుకుంటోంది. ఇంతింతై వటుడింతయై అన్నట్టు తొలినాళ్లలో జిల్లా స్థాయి కవులతో ప్రారంభమై నేడు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది.

దివంగత మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ సుబ్బరాజు గౌరవాధ్యక్షుడిగా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు సత్యనారాయణ అధ్యక్షునిగా, కవి, రచయిత, సాహితీ విమర్శకుడు గిడ్డి సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, కూచిమంచి కాత్యాయనశర్మ కోశాధికారిగా కళాసాహితి ఆవిర్భవించింది. 1989 శుక్ల ఉగాది నాడు ఎంవీఎస్ స్వగృహం ఆవరణ (ఏరువాక ప్రాంగణం)లో తొలిసారి ఉగాది కవి సమ్మేళనం, సాహితీ సభ నిర్వహించారు. ఎంవీఎస్ తదనంతరం పెన్మెత్స హరిహరదేవళరాజు అధ్యక్షుడిగా రోటరీ క్లబ్-కళాసాహితీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేదికను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ క్రోధి నామ ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం కవి సమ్మేళనం, సాహితీ సభ నిర్వహిస్తున్నారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ సాహితీ వేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, ప్రముఖ కవులు పాల్గొననున్నారు.

27 ఏళ్ల శ్రోతలను ఓలలాడించిన 'అద్దేపల్లి'

గొప్ప విశేషమేమిటంటే సాహితీ సంచార యోధుడిగా ఖ్యాతి ఘడించిన డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు 2017లో కాలధర్మం పొందే వరకూ ఏ ఏడాదీ వదలకుండా 27 ఏళ్ల ఆయన అధ్యక్షతనే ఇక్కడ ఉగాది కవి సమ్మేళనాలు, సాహితీ సభలు జరిగాయి. ఈ సాహితీ వేదిక అంటే ఆయనకు ఎంతో ఆసక్తి, ఎనలేని గౌరవం, అభిమానం. ఆయన సాహితీ ప్రసంగం చేశారంటే అతి పూర్తయ్యే వరకూ ఏ ఒక్కరూ కదిలేవారు కాదు. ఎన్నో గ్రంథాలు, రచనలు, కవితా సంపుటాలను ఆవిష్కరించారు. ఆయన చేతులు మీదుగా ఎందరో కవులను సత్కరించారు.

సుబ్బారావు సాహితీ సేద్యం



కవి సుబ్బారావు

కొత్తపేటలో ఉగాది కవి సమ్మేళనం, సాహితీ సభలు క్రమం తప్పకుండా జరుగుతూ వస్తున్నాయంటే దానికి కర్త, కర్మ, క్రియ సంస్థ ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు అనడంలో అతిశయోక్తి లేదు. ఆయన ఆధ్వర్యంలో కళాసాహితి 2013 ఉగాదికి రజతోత్సవం జగపగా, అదే వేదికపై కవులు, సాహితీవేత్తలు సుబ్బారావు సప్తతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 36 ఏళ్లుగా దిగ్విజయంగా జరుగుతుందంటే, అన్ని జిల్లాల నుంచి కవి కోయిలలు ఈ కళాసాహితీ వృక్షంపై వాలుతున్నాయంటే దానికి 82వ పడిలో కూడా కవి సుబ్బారావు కళా తపన, సాహితీ సేవే కారణం. అందుకే సుబ్బారావును కవి పిల్లల కోడి అంటారు.

నేడు ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతుంది. ఈ సమ్మేళనానికి రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కవులు హాజరుకానున్నారు. ఇప్పటికే కవి సమ్మేళానికి వస్తున్నట్లు, తమ ఉగాది కవితా గానం వినిపించనున్నట్లు ఆయా రాష్ట్రాల నుంచి మొత్తం 143 మంది కవులు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణకు కమిటీలు నియమించినట్లు ఈ వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి చెప్పారు. అతిథులకు భోజన, వసతి ఏర్పాట్లు కూడా సిద్ధం చేసినట్లు కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఉగాదిని స్వాగతిస్తూ ఆ పర్వదిన శుభ పరిణామాలను స్పృశిస్తూ కవుల కవితా గానాలతో శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందన్నారు.

సుబ్బారావు కృషితో నడుస్తున్న కళాసాహితి



కళాసాహితి దిగ్విజయంగా సాగుతోందంటే ప్రధాన కారకుడు గిడ్డి సుబ్బారావు. 1989లో ఆయన ప్రతిపాదన మేరకే కళాసాహితి ఆవిర్భవించింది. నాడు మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ సుబ్బరాజు తదితర పెద్దల ప్రోత్సాహంతో అదే ఏడాది ఉగాది కవిసమ్మేళనం, సాహితీ సభ జరిగింది. నాటి నుంచీ క్రమం తప్పకుండా ఏటా నిర్వహిస్తున్నాం.

– పెన్మెత్స హరిహరదేవళరాజు, అధ్యక్షుడు, కళాసాహితి, కొత్తపేట

కొత్తపేటకు కీర్తి కిరీటం



రాష్ట్రంలోనే ఉగాది కవి సమ్మేళం – సాహితీ సభలు అంటే గుర్తుకు వచ్చేది కొత్తపేట కళాసాహితి. దాన్ని నడిపిస్తున్న గిడ్డి సుబ్బారావు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు కొత్తపేటకే కీర్తి తెచ్చాయి. ఒకవైపు తపాలా శాఖ ఉద్యోగిగా పనిచేస్తూ మరోవైపు సాహితీ సేవ చేస్తున్నారు. ఉద్యోగానికి పదవీ విరమణ చేశాక పూర్తి సమయాన్ని సాహితీ సేవకే కేటాయించారు.

– షేక్ గౌస్, కవి, కళాసాహితి సభ్యుడు, కొత్తపేట

మానవత్వం చాటుకున్న మంత్రి విశ్వరూప్

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి సమర్యలు చేసిన వైనం
- దగ్గరుండి ఆస్పత్రికి తరలింపు



రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడిని ఆస్పత్రికి పంపించే ఏర్పాట్లు చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: స్థానిక ఎర్ర వంతెన సమీపంలో శనివారం ఉదయం మెయిన్ రోడ్డుపై ఓ యువకుడు మోటారు సైకిల్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో బాధపడుతున్నాడు. అదే సమయంలో ఎన్నికల ప్రచారానికి పార్టీ శ్రేణులతో వెళ్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆ క్షతగాత్రుడిని చూసి స్పందించారు. తక్షణమే అతడికి సపర్యలు అందించి అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి పంపించారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆ వాహనాన్ని రప్పించి ఆస్పత్రికి పంపారు. దాదాపు పావు గంట సమయం మంత్రి అక్కడే ఉండి అతడి వైద్యం కోసం తపన పడ్డారు. మంత్రి విశ్వరూప్ చూపిన మానవత్వాన్ని అక్కడ ఉన్న ప్రజలతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

- రూ.8.5 లక్షల విలువైన 17 వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితులతో సీఐ వెంకటేశ్వరావు, ఎస్సై అప్పలరాజు

ఉండ్రాజవరం: ఊరి బయట, పార్కింగ్ ప్రదేశాల్లో, నిర్మానుష్య ప్రదేశాల్లో, రాత్రి వేళ ఇంటి బయట నిలిపిన మోటర్ సైకిళ్లను చోరీ చేసే ఇద్దరు దొంగలను ఉండ్రాజవరం పోలీసులు అరెస్టు చేశారు. దొంగలతో పాటు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను ఉండ్రాజవరం పోలిస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల ఎదుట హాజరుపరిచారు. సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు నిడదవోలు జ్యోతి కాలనీకి చెందిన బొద్దురి సతీష్, నిడదవోలు మండలం సమిశ్రగూడెంకు చెందిన తాతోలు రామకృష్ణ చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేసి, వాటిని తీర్చలేక, ఇంటి అద్దెలు కట్టలేక దొంగతనాలు ప్రారంభించారు. ఈ క్రమంలో వారు ఉండ్రాజవరంలో రెండు, తణుకులో రెండు, రాజమండ్రిలో నాలుగు, కొవ్వూరులో మూడు, పాలకొల్లు, ఏలూరు, గణపవరం, నిడదవోలు, వీరవాసరం పోలీసుస్టేషన్ల పరిధిలో ఒకొక్కటి చొప్పున 17 మోటరు సైకిళ్లను చోరీ చేశారు. శనివారం స్థానిక రేణుక ఫిల్లింగ్ స్టేషన్ వద్ద వారిని ఎస్సై వి.అప్పలరాజు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 17 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.8.5 లక్షల ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు సీఐ తెలిపారు. వారిని పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సై వి.అప్పలరాజు, సిబ్బంది వై.నాగేశ్వరరావు, వి.బొజ్జి, ఎం.ముత్యాలరావు, కె.రమేష్‌బాబు, ఆర్‌కె. సత్యనారాయణలను సీఐ అభినందించారు.

భక్తులతో పోటెత్తిన వాడపల్లి



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

స్వామివారి ఆదాయం రూ.42.2 లక్షలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారు భక్తులకు పూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులు, ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాగణం కిక్కిరిసింది. ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి వారికి ప్రత్యేకదర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.42,20,590 ఆదాయం సమకూరిందన్నారు. అలాగే స్వామి వారి అధ్యయనోత్సవాలను వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. చతుర్వేద పారాయణం, ద్రవిడ పారాయణం, సాయంత్రం గరుడ వాహనం, పల్లకిపై స్వామి వారి గ్రామోత్సవం నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించి శాంతి భద్రతలను అదుపు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

గండేపల్లి: సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చునని హైదరాబాద్‌కు చెందిన ఎక్స్‌పర్ట్ ట్రైనర్, బ్రెయినోవిజన్ యశస్వి సురభి విద్యార్థులకు వివరించారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ కాన్ఫిగరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఫర్ డేటా సైన్స్ అప్లికేషన్ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన సదస్సుకు చివరి రోజైన శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏడబ్ల్యూఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని అన్నారు. కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ అమెజాన్ క్లౌడ్‌లో ఉండే ప్రక్రియలను, వివిధ ప్రాజెక్టులు చేయడానికి అనుసరించాల్సిన ప్రణాళికలను తెలుసుకోవడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవీ రాజేష్, కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

- రూ.11 లక్షల విలువైన 258 క్వింటాళ్లు స్వాధీనం



బియ్యం లారీ, నిందితులతో ఎంఎస్‌ఓ మమత, ఎస్సై రవీంద్రబాబు

కాకినాడ రూరల్: అనుమతులు లేకుండా, తప్పుడు వేబిల్లుతో విశాఖ జిల్లా పెద్దపల్లి గ్రామం నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్న బియ్యం లారీని తిమ్మాపురం పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. తమకందిన సమాచారంతో తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు, సిబ్బంది పండూరు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించి, ఈ లారీని గుర్తించారు. డ్రైవర్ షేక్ ఖాదర్‌ను విచారణ చేయగా, కాకినాడ పోర్టుకు వెళుతున్నట్టు చెప్పాడు. వేబిల్లు వరంగల్ పేరిట ఉంది. పీడీఎస్ బియ్యంగా అనుమానించి పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఎంఎస్‌ఓ మమత, సిబ్బందితో బియ్యం లారీని పరిశీలించి, శాంపిల్స్ సేకరించారు. లారీని కాకినాడలో ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. లారీలో మొత్తం 520 బస్తాలను గుర్తించారు. మొత్తం 258 క్వింటాళ్లని, సుమారు రూ.11 లక్షల వరకు సరకు ఉంటుందని అంచనా వేశారు. లారీ డ్రైవర్ షేక్ ఖాదర్, క్లీనర్ గణేష్, లారీ యజమాని జి.అర్జునరావుపై 6ఏ కేసును శనివారం నమోదు చేసినట్టు ఎంఎస్‌ఓ మమత తెలిపారు. దీనిపై ముగ్గురితో పాటు, బియ్యం యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవీంద్రబాబు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 7-4-2024

వైరల్



జీవితం అనే గురువు పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది

సంజయ్ లీలా భన్సాలి 'హీరామండి- ది డైమండ్ బజార్' వచ్చే నెల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. 'హీరామండి'లో మనిషా కోయిరాల నటించింది. 'హీరామండి' విడుదలకు ముందు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో తన జీవితంలోని ప్రధాన సంఘటనల గురించి సుదీర్ఘమైన నోట్ రాసింది మనిషా. క్యాన్సర్‌తో తాను పోరాడిన రోజులను గుర్తు తెచ్చుకుంది.

'ఎన్నో మంచి పాత్రలలో నటించాను. ఎంతో మంది ఉత్తమ దర్శకులతో కలిసి పనిచేశాను. ఎంతోమంది స్నేహాన్ని పొందాను. దేవుడి దయతో క్యాన్సర్‌తో పోరాడి గెలిచాను. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. నా జీవితంలో ఎన్నో లోతులను చూశాను. జీవితాన్ని మించిన గురువు లేదు. ఎన్నో పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది. కాలం విలువను తెలుసుకున్నాను' అంటూ రాసింది. మనిషా కోయిరాల రాసిన ఈ నోట్ నెట్‌జనులను బాగా కదిలించింది.

స్కేట్‌బోర్డ్‌పై మనాలి టు కన్యాకుమారి

'మనాలి నుంచి కన్యాకుమారికి ఎలా వెళతాం?' అనే ప్రశ్నకు 'స్కేట్‌బోర్డ్ మీద' అని ఎవరూ చెప్పరు. 'మీరు చెప్పక పోతేనేం... నేనైతే స్కేట్‌బోర్డ్ మీదే వెళ్లాను' అంటున్నాడు రితిక్. ప్రొఫెషనల్ స్కేట్ బోర్డర్ అయిన రితిక్ క్రాడ్జెల్ మనాలి నుంచి కన్యాకుమారికి స్కేట్‌బోర్డ్ మీద వెళ్లాడు.



ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోలు నెట్ లోకాన్ని అబ్బురపరుస్తున్నాయి.

చిన్న బ్యాక్‌ప్యాక్‌తో బయలుదేరిన రితిక్ 100 రోజుల్లో తన ప్రయాణాన్ని పూర్తి చేశాడు. రీల్స్, వీడియోలలో తనకు ఎదురైన అనుభవాలను నెటిజనులతో పంచుకున్నాడు. గూగుల్ మ్యాప్స్ పనిచేయకపోవడం నుంచి దట్టమైన పొగమంచుతో హైవేల జీరో విజిబిలిటీ వరకు రితిక్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకే వెళ్లాడు. రితిక్ సాహసం, ఓపికకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపించారు.

మా నాయినే! కొబ్బరికాయను తలకేసి కొట్టుకున్నాడు



కొబ్బరికాయను రాయిపై కొడితే పగులుతుంది. నుదుటిపై కొడితే? వైరల్ అవుతుంది! విషయంలోకి వస్తే... తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి కొబ్బరికాయ పట్టుకొని పూజాపీఠం దగ్గర శ్లోకాన్ని జపించాడు. ఆ తరువాత తల పైకి లేపి కొబ్బరికాయను నుదుటి మీద కొట్టుకున్నాడు. 'యాక్షన్‌కు రియాక్షన్' అనేది ప్రకృతి ధర్మం కదా! సదరు వ్యక్తి వెంటనే కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా వ్యక్తి చర్యను నెటిజనులు ఖండించారు. 'ఆపరేషన్ సక్సెస్ బట్ పేషెంట్ డెడ్', 'గాయపడింది నువ్వు కాదు... కొబ్బరికాయ'లాంటి సరదా కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

ది గ్రేట్ వడా పావ్ వార్



ఢిల్లీ 'వైరల్ వడా పావ్ గర్ల్'గా పాపులర్ అయిన చంద్రికా గెరా దీక్షిత్ తాజాగా తన ఫుడ్ కార్ట్ సార్టప్‌తో రాత్రికి రాత్రి సెన్సేషన్‌గా మారింది. దీక్షిత్ పాపులారిటీ మాట ఎలా ఉన్నా ఆమెకు పోటీదారులు పెరిగారు. దీక్షిత్ ఫుడ్ కార్ట్ చుట్టుపక్కల పోటీదారులు వడా పావ్ బండ్లను ఏర్పాటు చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. 'పాపులారిటీనే కొంపముంచిందా!' లాంటి హెడ్‌లైన్స్ నెటిజనుల నుంచి లైన్ కట్టాయి.

'నిన్న నేను రానందున తన బండిని ఉంచానని ఆంటీ చెప్పింది. ఈరోజు కూడా ఇక్కడే పెట్టింది. ఒకరి వ్యాపారాన్ని దెబ్బతీయాలనుకోవడం సమంజసమా!' అని తన ఆవేదనను వెళ్లగక్కింది దీక్షిత్.

ఫుడ్ వ్లాగర్ ఫూడీ మానేహా ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.

ఈ వీడియో వైరల్ కావడంతో పోటీదారు ఆంటీ 'ఒకరి వ్యాపారాన్ని దెబ్బ తీసే ఉద్దేశం నాకు లేదు. నా పని నేను చేసుకుపోతున్నాను' అని ఎర్రటి ఎండల్లో కూల్‌గా బదులిచ్చింది. 'బండి ఎవరు పెట్టారనేది కాదు... రుచి ముఖ్యం' అని కూడా సెలవిచ్చింది.

చిప్స్ ఉండగా పూల చింత ఏల!

'పెళ్లి ఊరేగింపు కారును దేనితో అలంకరిస్తారు?' అనే ప్రశ్నకు టక్కున వినిపించే జవాబు... పువ్వులు.

పూల కొరతో, ఖర్చు అనుకున్నారో.. వైవిధ్యం కోసమో ఏమో తెలియదుగానీ ఈ పెళ్లి కారును పొటాటో చిప్స్ ప్యాకెట్స్‌తో అలంకరించారు. సత్పాల్ యాదవ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. చిప్స్‌తో ముస్తాబైన ఈ పెళ్లి కారు గురించి నెటిజనులు సరదాగా స్పందించారు.

'పొటాటో చిప్స్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే పబ్లిసిటీ ఇది'

'చిప్స్ అంటే ఎంత ఇష్టముంటే మాత్రం ఇలానా!'

'చిప్స్‌కు బదులుగా ఫైవ్‌స్టార్ చాక్లెట్స్‌తో ముస్తాబు చేసి ఉంటే కారు వెంట జనాలు పరుగులు తీసేవారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.




Source: @ysatpal5…/Instagram

మన తెలుగువాడి బయోపిక్

చూపు లేకపోయినా అంట్రప్రెన్యూర్‌గా విజయం సాధించిన మన తెలుగువాడు శ్రీకాంత్ బొల్లా బయోపిక్ ఫస్ట్‌లుక్ వైరల్ అయ్యింది.
రాజ్ కుమార్ రావు శ్రీకాంత్ పాత్ర పోషిస్తున్నాడు.



శ్రీకాంత్ బొల్లా



శ్రీకాంత్ బొల్లా పాత్రలో రాజ్ కుమార్ రావు

పుట్టుకతో అంధత్వం వెంటాడినా విజయాలు అందుకోవడానికి అది అడ్డుకాదని నిరూపించిన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్' ఫస్ట్‌లుక్ విడుదలైంది. మంచి నటుడిగా పేరు గడించిన రాజ్‌కుమార్ రావు శ్రీకాంత్ పాత్రను పోషిస్తుండటం విశేషం. మచిలీపట్నంలో జన్మించిన శ్రీకాంత్ బొల్లా ఇంజినీరింగ్ చదువు విషయంలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నాడు. అంధుడైన కారణాన ఐఐటీలో సీటు పొందలేకపోయాడు. అయితే పట్టుదలతో మసాచూసెట్స్ యూనివర్సిటీలో తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థిగా దఖలయ్యి చదువుకున్నాడు. భారత్‌కు తిరిగి వచ్చి పారిశ్రామిక రంగంలో కీర్తి గడించాడు. బొల్లా జీవితం ఇప్పటికే ఎందరికో ఆదర్శం అయ్యింది. వెండితెర మీద ఆయన జీవితం చూసి మరెందరో స్ఫూర్తి పొందుతారు. తుషార్ హీరానందాని ఈ సినిమా దర్శకుడు.

నగదు మాత్రమే ఇవ్వండి



జేబులో డబ్బులు పెట్టుకోవడం జనం మానేశారు. ఖర్మగాలి ఫోన్ పే పని చేయకపోతే తెల్లముఖాలు వేస్తున్నారు. నగదు లావాదేవీల వల్ల ఎంత ఖర్చవుతున్నదో ఎంత మిగిలి ఉన్నదో తెలిసేది. కాని ఆన్‌లైన్ పేమెంట్లకు హద్దు లేదు. ఈ నేపథ్యంలో చెన్నైలో ఆటో నడిపే ఒక పెద్దాయన తన ఆటోలో పెట్టిన నోటీస్ ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది.
నగదు అవసరాన్ని గుర్తు చేసే పోస్ట్ ఇది.

'జీ పే చేయొద్దు. డబ్బు డ్రా చేయడానికి ఏటీఎం దగ్గర ఆపమని అడగొద్దు' అని చెన్నైలో ఒక ఆటోబాబాయ్ పెట్టిన బోర్డు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది. గతంలో అందరి దగ్గర డబ్బులుండేవి. ఆటో ఎక్కినా దిగినా డబ్బు ఇచ్చి బేరం ముగించేవారు. ఇప్పుడు అందరూ జీపే, ఫోన్‌పే చేస్తున్నారు. అయితే కొన్ని దుకాణాల్లో ఇప్పటికీ 'నగదు మాత్రమే' అనే బోర్డులు ఉన్నాయి. దానికి కారణం డిజిటల్ లావాదేవీల్లో ఏదైనా మోసం జరుగుతుందేమోనని. ఈ ఆటోబాబాయ్‌కి కూడా అలాంటి అనుభవాలు ఎదురై ఉండొచ్చు. లేదా ఎక్కిన వారు జీపే పని చేయకపోతే ఏటీఎం దగ్గరకు వెళదామని టైమ్ వేస్ట్ చేస్తూ ఉండొచ్చు. అందుకనే స్పష్టంగా 'ఏటీఎం దగ్గర ఆటో ఆపమని అడగొద్దు' అంటూ బోర్డ్ పెట్టాడు. చెన్నైలో ఇతని ఆటో ఎక్కిన మహిళ ఈ బోర్డును ఫొటో తీసి 'ఎక్స్'లో పెడితే ఇంటర్‌నెట్‌లో మంచి డిబేట్ నడిచింది. 'ఇలాగైతే ఎలా' అని కొందరంటే 'బ్యాంకు ట్రాన్సాక్షన్స్ అన్నీ డిజిటల్ పేమెంట్ల వల్ల ప్రభుత్వానికి ఎందుకు తెలియాలి?' అని కొందరు ప్రశ్నించారు. చివరకు ఆటో ఎక్కిన మహిళ తన అపార్ట్‌మెంట్ దగ్గర దిగి, సెక్యూరిటీ దగ్గర అప్పు తీసుకుని ఆటో బాబాయ్‌కి చెల్లించి బతుకు జీవుడా అనుకుంది.

హెల్త్

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ఏయే వయసుల్లో ఏయే వ్యాక్సిన్‌లు! ఏయే వైద్య పరీక్షలు..?



ఆరోగ్య సమస్య ఏమైనా వస్తే చికిత్స తప్ప ప్రత్యామ్నాయం లేదు. కానీ సమస్య రాకుండా ముందే నివారించుకుంటే ఆరోగ్యానికి ధోకా ఉండదు. చికిత్స కంటే నివారణే మేలు అనే సూక్తి మేరకు వ్యాధుల నివారణకు ఉపయోగపడే అంశాల్లో మొట్టమొదటి అంశం టీకాలు (వ్యాక్సిన్లు). రెండో అంశం... లక్షణాలు కనిపించగానే చేయించాల్సిన వైద్యపరీక్షలు. నేడు 'వరల్డ్ హెల్త్ డే'. ఈ సందర్భంగా ఏ వయసులో వారు ఏయే వ్యాక్సిన్లు తీసుకోవాలన్న అంశంపై అవగాహన కోసం ఈ కథనం.

టీకాలు

చిన్నారి పుట్టిన వెంటనే... ఓపీవీ, బీసీజీలతో పాటు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇస్తారు. ఆ తర్వాత 6, 10, 14 వారాల్లో ఇస్తారు).

ఆరు వారాలప్పుడు : ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టిటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా ఫస్ట్ డోస్ ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా ఫస్ట్ డోస్ ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా ఫస్ట్ డోస్ ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) ఫస్ట్ డోస్ ● రొటావైరస్ టీకా మొదటి డోస్ (ఇది నోటిద్వారా ఇస్తారు) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ రెండో డోస్.

పది వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టిటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా రెండో మోతాదు ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా రెండో మోతాదు ● ఐపీవీ / ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా రెండోడోస్ ● పీసీవీ 13 రెండో మోతాదు ● నోటిద్వారా ఇచ్చే రొటావైరస్ టీకా రెండో డోస్ ● హెపటైటిస్–బి మూడో డోస్.

పద్నాలుగు వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టిటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా మూడో మోతాదు ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా మూడోమోతాదు ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా మూడో మోతాదు ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) మూడో మోతాదు ● రొటావైరస్ టీకా మూడో డోస్ (ఇది నోటిద్వారా ఇచ్చే డోస్) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ నాలుగో మోతాదు.

ఆరు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా మొదటి మోతాదు ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) మొదటి మోతాదు

ఏడు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా రెండో మోతాదు

తొమ్మిది నెలల వయసప్పుడు : ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) రెండో మోతాదు ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా ఫస్ట్ డోస్ ● టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్ ఇస్తారు.

పన్నెండు నుంచి 15 నెలల వయసప్పుడు: ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా రెండో మోతాదు ● వారిసెల్లా (చికెన్‌పాక్స్) టీకా మొదటి మోతాదు ● హెపటైటిస్–ఏ టీకా మొదటి మోతాదు (దీని రెండో డోస్ సాధారణంగా 18 నెలలప్పుడు ఇస్తారు) ● పీసీవీ (ప్యాక్‌డ్ సెల్ వాల్యూమ్) బూస్టర్.

పద్దెనిమిది నెలల వయసప్పుడు : ● డీట్యాప్ టీకా మొదటి బూస్టర్ డోస్ ● హెచ్ఐబీ (హిబ్) టీకా మొదటి బూస్టర్ డోస్ ● ఐపీవీ లేదా ఓపీవీ టీకా ● హెపటైటిస్–ఏ రెండో డోస్.

మూడేళ్ల వయసప్పుడు: ● వారిసెల్లా వ్యాక్సిన్ రెండో డోస్ టీకా.

ఐదేళ్లప్పుడు: ● డీ–ట్యాప్ టీకా రెండో బూస్టర్ ● ఐపీవీ టీకా ● ఎమ్ఎమ్ఆర్ టీకా మూడో డోస్.

పది నుంచి పన్నెండేళ్ల వయసప్పుడు: ● హెచ్‌పీవీ టీకా మొదటి డోస్ (దీని రెండు, మూడు డోసులు 9 నుంచి 18 ఏళ్ల వయసప్పుడు) ● టీడ్యాప్ టీకా బూస్టర్ డోస్ ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా మొదటి డోస్ (దీని బూస్టర్ 16 ఏళ్ల వయసప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది).

పదిహేను నుంచి 16 ఏళ్ల వయసప్పుడు: ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా బూస్టర్ డోస్ ● టీడీ / డీటీ టీకా.

18 నుంచి 65 ఏళ్ల వరకు: ఈ వయసులో ఎవరికైనా మంచి వ్యాధి నిరోధకత ఉంటుంది. గతం లో ఏదైనా వ్యాక్సిన్ తీసుకోకపోతే... డాక్టర్ సలహా మేరకు తీసుకోవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ గుర్తులేనప్పుడు డాక్టర్‌కు ఆ విషయం చెబితే... వారు కొన్ని పరీక్షల ద్వారా వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ నిర్ధారించి అవసరమైతే ఇస్తారు.

65 ఏళ్లు పైబడిన వారికి: ఈ వయసు దాటాక కొన్ని వ్యాక్సిన్లు తప్పనిసరిగాను, మరికొన్ని అవసరాన్ని బట్టి తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు... ● పీసీవీ–13 అండ్ పీపీఎస్‌వీ 23 అనే వ్యాక్సిన్లను సాధారణంగా 65 ఏళ్లు దాటినవారికి ఇస్తుంటారు. ఇవి నిమోనియాను నివారించే నిమోకోకల్ వ్యాక్సిన్స్‌లు. ఇందులో తొలుత పీసీవీ–13 ఇస్తారు. ఆ తర్వాత రెండు నెలలకు పీపీఎస్‌వీ–23 ఇస్తారు ● టీ–డ్యాప్ వ్యాక్సిన్ : చిన్నప్పుడు తీసుకున్న టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ వ్యాధులను నివారించే వ్యాక్సిన్ తాలూకు బూస్టర్ డోసులను 65 ఏళ్లు పైబడ్డ తర్వాత ప్రతి పదేళ్లకోమారు తీసుకుంటూ ఉండాలి.



డాక్టర్ బీవీఎస్ అపూర్వ
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్

ముందుగానే కొన్ని వైద్య పరీక్షలు చేయించడం వల్ల కొన్ని వ్యాధుల్ని కనుగొని సంపూర్ణంగా నయం చేసుకోవచ్చు. ఉదాహరణకు సర్వైకల్ క్యాన్సర్ అనే వ్యాధికి సుదీర్ఘమైన ముందస్తు వ్యవధి ఉంటుంది. అంటే అసలు వ్యాధి రావడానికి పదేళ్ల ముందునుంచే 'ప్రీ–సర్వైకల్ పీరియడ్' ఉంటుంది. పాప్ స్మియర్ అనే పరీక్ష ద్వారా వ్యాధి రాబోయే దశాబ్దకాలం ముందుగానే దాన్ని కనుగొనవచ్చు. క్యాన్సర్ ను ఎంత త్వరగా కనుగొంటే అంత తేలికగా నయమవుతుంది. ఆరోగ్యంగా ఉండటం కోసం ముందస్తుగా ఏయే వయసుల్లో ఏయే వైద్యపరీక్షలు ఉపకరిస్తాయో తెలుసుకుందాం.

పరీక్షలు

0 - 10 ఏళ్ల వయసులో: ఈ వయసులో అవసరం అయితే తప్ప పెద్దగా వైద్యపరీక్షలు అవసరం లేదు.

11 - 20 ఏళ్లు : ఇది యుక్త వయసులోకి మారే దశ. నిర్దిష్టంగా ఏవైనా వైద్యసమస్యలు ఉండటం లేదా లక్షణాలు కనిపించడం వంటి సమయాల్లో తప్ప... ఈ వయసులోనూ పెద్దగా వైద్యపరీక్షలు అవసరం పడవు.

20 - 30 ఏళ్లు : ఈ వయసులో కొన్ని లైంగిక సాంక్రమిక వ్యాధులు (ఎస్‌టీఐ'స్) కోసం మరీ ముఖ్యంగా హెపటైటిస్–బీ నిర్ధారణ పరీక్షలు చేయించి హెచ్‌బీఐజీ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే అమ్మాయిలైతే పాప్‌స్మియర్ వంటి గైనిక్ పరీక్షలు చేయించుకుని, 12 ఏళ్ల నుంచి 26 ఏళ్ల మధ్యకాలంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ప్రయోజనకరం.

30 నుంచి 40 ఏళ్లు : ఈ వయసు నుంచి డయాబెటిస్ కోసం హెచ్‌బీఏ1సీ అనే రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. ఏవైనా తేడాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఈసీజీ, టూ డీ ఎకో, అవసరాన్ని బట్టి ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలూ మంచిదే. మహిళలైతే డాక్టర్ సలహా మేరకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్ పరీక్ష చేయించాలి.

40 - 50 ఏళ్లు : ఈ వయసు నుంచి దేహంలో కొన్ని మార్పులు మొదలవుతాయి. అందుకే ఈ వయసులో పరీక్షలు తరచూ చేయిస్తుండటం మేలు. రక్తపోటును తెలుసుకోవడం కోసం సిస్టోల్, డయాస్టోల్ ప్రెషర్స్, రక్తలో చక్కెర మోతాదుల కోసం హెచ్‌బీఏ1సీతో పాటు అవసరమైతే గ్లూకోస్ టాలరెన్స్ టెస్ట్ (జీటీటీ), పొద్దున్నే పరగడుపున, ఏదైనా తిన్న తర్వాత చేసే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్ వైద్య పరీక్షలతోపాటు అవసరాన్ని బట్టి కొన్నిరకాల క్యాన్సర్ పరీక్షలు చేయించడం మంచిది.

అలాగే మహిళలైతే ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ డెన్సిటీ పరీక్ష చేయించాలి. దాంతోపాటు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను డాక్టర్ చెప్పిన వ్యవధుల్లో చేయించాలి.

ఇక పురుషులైతే ఈ వయసు నుంచి ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఏంటీజెన్... సంక్షిప్తంగా పీఎస్ఏ అనే పరీక్షను డాక్టర్లు చెప్పిన వ్యవధుల్లో చేయించుకుంటూ ఉండాలి.

50 - 60 ఏళ్లు : చాలామంది 50 ఏళ్ల వరకు ఎలాంటి పరీక్షలు చేయించకపోవచ్చు. అయితే అలాంటివాళ్లంతా ఈ 50 – 60 ఏళ్ల మధ్యవయసులో తప్పక వైద్యపరీక్షలు చేయించాల్సిన అవసరం తప్పక వస్తుంది. ముందు నుంచి పరీక్షలు చేయించని వాళ్లతోపాటు ఈ వయసులోని అందరూ ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండె జబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతో పాటు లక్షణాలను బట్టి ఇతర వైద్యపరీక్షలు చేయిస్తుండాలి.

మహిళలకు 50 ఏళ్ల వయసు తర్వాత మెనోపాజ్ రావడంతో గుండెకు ఉండే ఒక సహజ రక్షణ తొలగిపోతుంది. అందువల్ల గతంలో చేయించినా, చేయించక పోయినా ఈ వయసు నుంచి మహిళలు గుండెకు సంబంధించిన అన్ని స్క్రీనింగ్ పరీక్షలు అంటే ఈసీజీ, టూడీ ఎకో, ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి.

60 నుంచి 70 ఏళ్లు : ఈ వయసులో వాళ్లనే సీనియర్ సిటిజెన్‌గా పరిగణిస్తుంటారు. పురుషులూ మహిళలు అన్న తేడా లేకుండా... ఈ వయసు నుంచి అందరూ... ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండెజబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతోపాటు లక్షణాలను బట్టి మరికొన్ని ప్రత్యేకమైన పరీక్షలు అవసరమవుతాయి.

70+ పైబడ్డాక... ఆపైన కూడా...

ఈ వయసు నుంచి లక్షణాలను బట్టి ఓ వ్యక్తి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండేందుకు పైన పేర్కొన్న వైద్యపరీక్షలతో పాటు కొన్ని వ్యాక్సిన్లు, మరికొన్ని మందులు తీసుకోవాలి. ఒకవేళ పోషకాహార లోపం ఉంటే, తగిన ఆహారం తీసుకోవాలి. దాంతోపాటు అవసరం అయితే మరికొన్ని హెల్త్ సప్లిమెంట్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది.



డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్
జనరల్ ఫిజీషియన్